

వాకలపూడి-అన్నవరం హైవే ప్రతిపాదిత ప్రాంతం

రేపు సీఎం చంద్రబాబు నల్లజర్ల రాక

- ‘రైతన్నా.. మీకోసం’ కార్యక్రమంలో రైతులతో ముఖాముఖి
- ఏర్పాట్లు పరిశీలించిన ‘తూర్పు’ కలెక్టర్, ఎస్పీ



రాజమహేంద్రవరం/నల్లజర్ల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఈనెల 3వ తేదీ బుధవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్నా-మీకోసం కార్యక్రమంలో భాగంగా నల్లజర్ల రానున్నారు. ఈ నేపథ్యంలో సమయం తక్కువగా ఉండడంతో అధికార యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్‌తో కలసి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహకిశోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ బుధవారం సీఎం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చకచకాచేయాలని, పర్యటన విజయవంతం చేయాలన్నారు. ప్రొటోకాల్, భద్రత, సభా ప్రాంగణం, ప్రజా వేదిక, హెలిప్యాడ్, రవాణా అండ్ పార్కింగ్, స్టాల్స్, రైతులతో సీఎం ముఖాముఖి వంటి ఏర్పాట్లపై విభాగాలవారీగా సూచనలు చేశారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత తొలిసారి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్నారని, రైతుల కోసం వస్తున్నారని, అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జేసీ మేఘాస్వరూప్, ఏఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు పాల్గొన్నారు. నల్లజర్ల బైపాస్ సమీపంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు సభస్థలాన్ని ఏర్పాటుచేశారు. ఆయిల్‌పాం గెలల కోత, గిట్టుబాటు ధరలపై రైతులతో సీఎం మాట్లాడతారు. వరి రైతులు, కూరగాయల రైతులతోనూ మాట్లాడేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10గంటలకు చంద్రబాబు చేరుకుంటారని సమాచారం. ఈ కార్యక్రమం తర్వాత కేడర్‌తోనూ భేటీ ఉంటుంది.



రబీకి రెడీనా..

వ్యవసాయ సీజన్.. మారుతోంది. ఖరీఫ్, రబీ సీజన్లలో ఎప్పుడు నారుమళ్లు వేయాలి, ఎప్పుడు ఊడ్పులు చేయాలి, పంట చేతికొచ్చేది, మాసూళ్లు ఎప్పుడు పూర్తవుతాయో ఒక లెక్క ఉండేది. వాతావరణ మార్పులు, తుఫాన్ల దెబ్బకు ఈ సీజన్‌లు అస్తవ్యస్తం అయ్యాయి. ఈ నెలాఖరుకి రబీకి నాట్లు పడాలి. కానీ వరి కోతలు ఇంకా సాగుతున్నాయి. పది రోజుల దాకా కొనసాగే పరిస్థితి ఉంది. మరి రబీ నాట్లు ఎప్పుడు పూర్తవుతాయి. కచ్చితంగా ఆలస్యమవుతాయని చెప్పొచ్చు.

- పూర్తికాని ఖరీఫ్ మాసూళ్లు
- 31లోపు రబీ నాట్లు పూర్తంటే ఎలా
- తూర్పు డెల్టాకు నీరు విడుదల
- సెంట్రల్, పశ్చిమ డెల్టాలకు ఎప్పుడో
- ఖరీఫ్ రైతును వెంటాడుతున్న వానలు
- ఈనెల 15వ తేదీలోపు ఖరీఫ్ ఒబ్బిడి
- ఇప్పటికే 2 లక్షల 10 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో 8.96,507 ఎకరాల్లో రబీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని మూడు డెల్టాల పరిధిలోని వరిసాగు ఒక పద్ధతిలో సాగడంలేదు. పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడకూడదంటే ముందుగానే పంట సాగు మొదలుపెట్టాలనే ఆలోచన ఎప్పటి నుంచో ఉంది. గతంలో మే నెలలోనే నారుమళ్లకు సిద్ధం చేసుకుని, జూన్ నెలలో నాట్లు మొదలు పెట్టేవారు. కొన్నేళ్ల నుంచి ఈ క్రమం తప్పింది. బాగా ఆలస్యం అవుతోంది. డిసెంబరు నెల వచ్చేసినా వరి కోతలు ఇంకా పూర్తికాలేదు. తూర్పుగోదావరి జిల్లాలో మూడు వంతులకుపైగా జరిగినా, మిగతా జిల్లాల్లో వరి మాసూళ్లు పూర్తికాలేదు. ఈ పరిస్థితుల్లో రైతుల ధాన్యం ఇంకా కొంత వరకూ కళ్లాలలోనూ, రోడ్లమీద ఆరబోతలోనూ, రాశులుగానూ ఉంది. దిత్వా తుఫాన్ వల్ల ప్రస్తుతం కోతలు ఆపేసినా, ఆరబోసిన ధాన్యాన్ని రక్షించుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కానీ ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండడంతో చాలావరకూ ధాన్యం కొనుగోలు జరుగుతోంది. సోమవారం నాటికి జిల్లాలో 29,164 మంది రైతుల నుంచి 2,21,036 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 20,225 మంది రైతులకు రూ.340.70 కోట్లు జమచేశారు. ఇది మంచి పరిణామమే. కానీ రబీ సాగు విషయంలో ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ధవళేశ్వరం సర్కిల్ పరిధిలోని తూర్పు, పశ్చిమ, సెంట్రల్ డెల్టాల్లో సోమవారం నుంచే రబీ ప్రారంభమైనట్టు చెబుతూ, ఈనెలాఖరు నాటికి నాట్లు కచ్చితంగా పూర్తి కావాలని చెబుతున్నారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు. సంక్రాంతి తర్వాత వరకూ కూడా రబీ సాగు కొనసాగే పరిస్థితి ఉంది. ఇక ఫిబ్రవరి 1 నుంచి సాగునీటిని వంతుల వారీగా అమలుచేయడానికి నిర్ణయించారు. వచ్చే ఏడాది మార్చి 31కి రబీ సాగు పూర్తి చేయాలనేది నిర్ణయం.


బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఎమ్మెల్యేలు గోరంట్ల, నల్లమిల్లి, బండారు

• 93.26 టీఎంసీల నీరు అవసరం

ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వచ్చే నీటితో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని తూర్పు, సెంట్రల్, పశ్చిమ, డెల్టాలకు సంబంధించి ఈ రబీలో 8,96,507 ఎకరాల్లో వరిపంట సాగుచేయనున్నారు. అందులో తూర్పుడెల్టా, పీబీసీ పరిధిలో 2,64,507 ఎకరాలు, గోదావరి సెంట్రల్ డెల్టా పరిధిలో 1,72,000 ఎకరాలు, పశ్చిమ డెల్టా పరిధిలో 4,60,000 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంటుంది. దీనికోసం 93.26 టీఎంసీల సాగునీరు అవసరం. అయితే అంతనీరూ అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నారు. మార్చి 31వ తేదీకి పూర్తవ్వాలని అధికారులు చెబుతున్నా, ఇతర ప్రాంతాల వారు మాత్రం ఏప్రిల్ 15వ తేదీ వరకూ నీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

● తూర్పు డెల్టాకు నీరు విడుదల

రబీసాగు కోసం తూర్పు డెల్టాకు సోమవారం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేశారు. కానీ ఇంకా సెంట్రల్, పశ్చిమ డెల్టాలకు నీటిని విడుదల చేయలేదు. సోమవారం ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. బండారు సత్యానందరావు సమక్షంలో తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్, ఈఈ శ్రీనివాస్, డిఈరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘గతి’మారింది

- రూ.1,040కోట్ల వాకలపూడి-అన్నవరం జాతీయ రహదారి నిర్మాణంలో కీలక అడుగు
- ఈ కీలక హైవే ప్రాజెక్టును పీఎం గతిశక్తి పథకంలోకి చేర్చిన కేంద్రం
- పనులను పర్యవేక్షించనున్న ప్రధానమంత్రి కార్యాలయం
- తాజాగా తెరుచుకున్న బిడ్లు: బరిలో తొమ్మిది కంపెనీలు
- నెలన్నరలోగా కాంట్రాక్టు కంపెనీ ఎంపిక: 24నెలల్లో హైవే పూర్తి
- 40.62కి.మీ మేర కొత్త హైవేకు 95శాతం భూసేకణ పూర్తి
- హైవే నిర్మాణం పూర్తయితే కాకినాడ పోర్టులు, సెజ్‌కు పెరగనున్న కనెక్టవిటీ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడలో వాకలపూడి నుంచి అన్నవరం వరకు కొత్త జాతీయ రహదారిని నిర్మాణంలో కీలక అడుగు పడింది. రూ.1,040కోట్లతో నిర్మించనున్న ఈ కొత్త హైవేకు కేంద్రం తీపి కబురు అందించింది. ఏకంగా ఈహైవే నిర్మాణ ప్రాజెక్టుకు పీఎం గతిశక్తి పథకంలో చేర్చింది. తద్వారా నేరుగా ప్రధాని కార్యాలయమే ఇకపై కొత్త హైవే పనులను పర్యవేక్షించబోతోంది. దీనివల్ల ఏ జాప్యం లేకుండా అత్యంత వేగవంతంగా హైవే నిర్మాణం పూర్తి కావడానికి మార్గం సుగమమైంది. మొత్తం 40.62 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ హైవేకు ఇటీవల కేంద్రం టెండర్లు పిలవగా రెండు వారాల కింద తెరచిన బిడ్లలో 9 కంపెనీలు పోటీపడ్డట్లు గుర్తించారు. వీటిలో ఏ కంపెనీకి హైవే కాంట్రాక్టు దక్కేందుకు అర్హత ఉందనేది ప్రస్తుతం స్క్రూటినీ చేస్తున్నారు. కాగా హైవే నిర్మాణానికి ఆరు మండలాల పరిధిలో 575 ఎకరాలు కావాల్సి ఉండగా అధికారులు 95 శాతం భూమిని సేకరించి ఎన్‌హెచ్ అధికారులకు అప్పగించారు. దీంతో కీలకమైన భూసేకరణ కొలిక్కివచ్చింది. మరో పక్క ఈ హైవే నిర్మాణం పూర్తయితే కాకినాడ సెజ్, మరో రెండుపోర్టులు, నిర్మాణ దశలో ఉన్న కేజీపీఎల్ పోర్టుకు కనెక్టవిటీ భారీగా పెరగనుంది.

‘గతి’ మారిపోయినట్లే..

సుదీర్ఘ సాగర తీరం కలిగి ఉన్న కాకినాడ పారిశ్రామికంగా ఎదిగేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. కానీ ఈ నగరం ఓ మూలన విసిరేసినట్లు ఉండడం, ప్రధాన జాతీయ రహదారికి సైతం దూరంగా ఉండడంతో ఆశించినంత అభివృద్ధి జరగలేదు. కాకినాడలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన యాంకరేజ్ పోర్టు, దానికి సమీపంలో కాకినాడ సీపోర్టు ఆధ్వర్యంలో డీప్‌వాటర్ పోర్టు ఉన్నాయి. ఎన్నో ఏళ్ల కిందట పదివేల ఎకరాల్లో కాకినాడ సెజ్ సైతం ఏర్పాటైంది. దేశంలోనే ఇది అత్యంత పెద్ద సెజ్. ఇందులో రూ2,621కోట్లతో కాకినాడ గేట్‌వే పోర్టు(కేజీపీఎల్) నిర్మాణం జరుగుతోంది. అటు విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ నడవాలో కాకినాడ కూడా ఉంది. ఇలా అభివృద్ధికి ఎంతో కీలక అవకాశం ఉన్న కాకినాడకు రోడ్డు కనెక్టివిటీ అనుకున్నంతగా లేదు. దీంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా కాకినాడలోని రెండు పోర్టులకు, సెజ్‌కు విశాఖ పోర్టు, అటు అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి పారిశ్రామిక, ఫార్మా ప్రాంతాల నుంచి భారీగా కార్గో వచ్చే అవకాశం ఉంది. కానీ ఈ కార్గో అన్నవరం హైవే మీదుగా కత్తిపూడి నుంచి పిఠాపురం మీదుగా కాకినాడ రావాలి. దీనికి ఎంతో వ్యయభారం అవుతోంది. పైగా పలు పట్టణాలు కూడా మధ్యలో ఉండడంతో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు కాకినాడపోర్టు, సెజ్‌కు అనుసంధానం తక్కువగా ఉంటోంది. పైగా పారిశ్రామికపరంగానూ సెజ్, పోర్టులు ఎదగాలంటే ప్రత్యేక హైవే అవసరమని కేంద్రం గుర్తించింది. ఈ నేపథ్యంలో కాకినాడ పోర్టులకు సమీపంలో ఉన్న వాకలపూడి నుంచి అన్నవరం బైపాస్ వరకు 40.62 కిలోమీటర్ల మేర హైవే నిర్మించాలని కేంద్రం కొన్నేళ్ల కిందట ప్రతిపాదించింది. ఇందుకు రూ.1,040కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. ప్రధానంగా ఈ హైవే నిర్మాణ పనులు కాకినాడ రూరల్, యు.కొత్తపల్లి, తొండంగి, శంఖవరం.. ఇలా మొత్తం ఆరు మండలాల్లో 21 గ్రామాల మీదుగా దీన్ని నిర్మించాలని ప్రతిపాదించింది. వాకలపూడి వద్ద మొదలయ్యే ఈ హైవేను చెన్నై-కోల్‌కతా ఎన్‌హెచ్16కు అన్నవరం వద్ద అనుసంధానించనున్నారు. ఇందుకు 230.92 హెక్టార్ల భూమి కావాల్సి ఉండగా, ఇందులో 35.85 హెక్టార్లు ప్రభుత్వానికి, మరో 195.07 ఎకరాలు ప్రైవేటుది సేకరించాలని నిర్ణయించారు. ప్రైవేటు భూముల సేకరణకు అనేక చిక్కులు రావడంతో దాదాపు మూడేళ్ల వ్యవధి భూసేకరణకు పట్టింది. ప్రధానంగా వాకలపూడినుంచి యు.కొత్తపల్లి, తొండంగి మీదుగా అన్నవరం బైపాస్ వరకు అతికష్టంపై రెవెన్యూ అధికారులు భూసేకరణ ప్రక్రియను తాజాగా కొలిక్కి తీసుకువచ్చారు. 95శాతం భూమిని సేకరించి హైవే అథారిటీకి ఇటీవల అప్పగించారు. దీంతో ఈ హైవే పనులకు సంబంధించి అతిపెద్ద చిక్కుముళ్లు వీడినట్లయింది. ఈ మేరకు రూ.230కోట్లవరకు భూసేకరణకు నిధులు వెచ్చించారు. కాగా ఎట్టకేలకు భూసేకరణ ముగియడంతో ఇప్పుడు ఈ హైవే నిర్మాణాన్ని పరుగులు పెట్టించాల్సిన అవసరాన్ని కేంద్రం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఈ హైవేను ఏకంగా కేంద్రం పీఎం గతిశక్తి పథకంలోకి చేర్చుతూ నిర్ణయం తీసుకుంది. దేశంలో అతికొద్ది కీలక కొత్త హైవే నిర్మాణాలను మాత్రమే కేంద్రం ఈ పథకంలోకి తీసుకోగా, తాజాగా వాకలపూడి-అన్నవరం హైవేను ఈ జాబితాలో చేర్చారు. దీనికి సంబంధించి నవంబరు 26న ప్రధాని మోదీ ఈ హైవేపైనా సమీక్షించారు. మరోపక్క ఇకపై ఈ హైవే పనులను పీఎం కార్యాలయం నేరుగా పర్యవేక్షించనుంది.

ఎట్టకేలకు తెరుచుకున్న బిడ్లు

రూ.1,040కోట్ల వ్యయమయ్యే ఈహైవే నిర్మాణానికి ఇటీవల కేంద్రం టెండర్లు పిలిచింది. వీటికి ఇటీవల బిడ్లు తెరిచిన అధికారులు 9కంపెనీలు ముందుకు వచ్చినట్లు గుర్తించారు. దీంతో ఒక్కో కంపెనీ అర్హతలపై స్క్రూటినీని అధికారులు ప్రారంభించారు. వచ్చేనెలలోగా వీటిలో ఎవరు అర్హులో నిర్ధారించి లెటర్ ఆఫ్ అవార్డును(ఎల్‌వోఏ) అందించనున్నారు. ఎల్‌వోఏ జారీ అయిన తర్వాత 24 నెలల్లో ఈహైవేను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ హైవేను కేంద్రం హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ కింద ఎంపిక చేసింది. అంటే 60శాతం నిధులు తొలుత కాంట్రాక్టు కంపెనీ పెట్టుబడి పెట్టాలి. కేంద్రం 40శాతం పెట్టుబడిని పని ప్రారంభం అయ్యాక 5శాతం నిధులు చొప్పున 8వాయిదాల్లో చెల్లిస్తుంది. హైవే పూర్తయ్యాక కాంట్రాక్టరు పెట్టిన 60శాతం పెట్టుబడిని కేంద్రం 30వాయిదాల్లో తిరిగి చెల్లించనుంది. ఈ హైవే నిర్మాణ పనులు ఈపాటికే ప్రారంభం కావాల్సి ఉంది. తొలుత ఈ కాంట్రాక్టును ఈ ఏడాది జులైలో అరబిందో రియాల్టీ కంపెనీ దక్కించుకుంది. తీరా ఆ తర్వాత కంపెనీపై పలు కేసులున్నట్లు నిర్ధారణ అవడంతో కేంద్రం ఈ టెండరు రద్దు చేసి మళ్లీ పిలిచింది. కాగా ఈ కొత్త హైవే నిర్మాణం పూర్తయితే కాకినాడకు మహర్దశ పట్టినట్లే. ప్రస్తుతం కాకినాడ నుంచి ఎన్‌హెచ్ 16కు వెళ్లాలంటే పెద్దాపురం ఏడీబీ రోడ్డు మీదుగా రాజానగరం చేరుకుని అక్కడినుంచి హైవేకు ఎక్కాలి. కానీ ఇప్పుడు కేవలం 40కిలోమీటర్ల దూరం ప్రయాణించి కాకినాడనుంచి అన్నవరం హైవేకు ఎంచక్కా వెళ్లిపోవచ్చు. హైవే నిర్మాణం పూర్తయితే నేరుగా అనకాపల్లి జిల్లానుంచి భారీ ఫార్మా కార్గో సైతం కాకినాడలోని ఓడరేవులకు, ఇక్కడి కార్గో ఇతర ప్రాంతాలకు సులువుగా ఎగుమతి, దిగుమతులు చేయడానికి వీలుపడుతుంది. అన్నవరం నుంచి కత్తిపూడి మీదుగా కాకినాడకు ద్విచక్రవాహనాలు, కార్లలో వచ్చే వారికి సమయం అధికంగా తీసుకుంటోంది. అదే అన్నవరం నుంచి వాకలపూడికి భవిష్యత్తులో నిర్మాణం కానున్న హైవే ద్వారా చాలా తక్కువ దూరం, సమయంలో చేరుకోవచ్చు.


అర్జీదారుల సమస్య వింటున్న డీఆర్‌వో వెంకట్రావు

పీజీఆర్‌ఎస్‌కు 388 అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 388 అర్జీలు వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ ప్రజలు సమస్యల పరిష్కారం కోరుతూ అందించిన అర్జీలను సంబంధితశాఖ అధికారులు ప్రత్యేక దృష్టితో పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. బియ్యంకార్డుల మంజూరు,కార్డుల్లో పేర్ల మార్పులు, చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, రీ సర్వే, పారిశుద్ధ్యం, అన్నదాత సుఖీభవ పథకాలకు అర్జీలు వచ్చాయి. జీజీహెచ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీధర్, కేఆర్ఆర్సీ ఎస్డీసీ రత్నమణి, సీపీవో త్రినాథ్, డీపీవో రవికుమార్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

- జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్


ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో నాయక్ జెండా


ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో నాయక్, ట్రైనీ కలెక్టర్ మనీషా

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బాధితులకు అండగా నిలవడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపవచ్చని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ మండలి సంయుక్తంగా సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ బాలాజీచెరువు సెంటర్ వరకు కొనసాగింది.

పోషకాహార కిట్ల అందజేత

అనంతరం కలెక్టరేట్ విధానగౌతమి హాల్లో హెచ్‌ఐవీ బాధిత బాలబాలికలతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ట్రైనీ కలెక్టర్ మనీషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె బాధిత చిన్నారులకు పోషకాహార కిట్లను అందజేశారు. జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగస్తులకు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్‌పట్ల పూర్తి అవగాహన పొందడం ద్వారా ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిని నిరోధించడమే కాకుండా ఈ మహమ్మారి బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. ఎయిడ్స్ వ్యాధి నివారణ, అవగాహనకు ప్రభుత్వం వివిధ స్వచ్ఛంద సంస్థ ద్వారా వివిధ చర్యలు చేపడుతున్నాయన్నారు. బాధిత పిల్లలు తమ జీవనశైలిని మార్పు చేసుకోవడం ద్వారా సాధారణ వ్యక్తులుగా జీవించవచ్చన్నారు. రెడ్‌క్రాస్ చైర్మెన్ వైడీ రామారావు మాట్లాడుతూ వ్యాధి బారిన పడిన చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. ఎయిడ్స్ ప్రభావిత బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేక్ కట్ చేసిన ట్రైనీ కలెక్టర్

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నాడే ట్రైనీ కలెక్టర్ మనీషా పుట్టినరోజు కావడంతో బాధిత పిల్లలతో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. అనంతరం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనం కార్యక్రమంలో అధికారుల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో, విద్యార్థులతో ఆమె భోజనం చేస్తూ ముచ్చటించారు. ఆత్మస్థైర్యంతో చదువు కొనసాగించాలని వారిలో భరోసా నింపారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.చలమయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ మహేష్, ఆర్ఎంసీ మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పీవీ ప్రసన్నకుమార్, జీజీహెచ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ కోమల, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, ఓఎన్‌జీసీ కాకినాడ ప్రతినిధి సునీల్, కాకినాడ ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ చిట్ల కిరణ్, దిశ ప్రోగ్రామ్ మేనేజర్ పి.బాలాజీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.

కాకినాడ-మైసూరు మధ్య 24 ప్రత్యేక రైళ్లు 7

ఐవీఆర్‌ఎస్ సర్వేలో ‘అన్నవరం’ ఆరో స్థానం 7

అన్నవరం దేవస్థానానికి పెంకుటిల్లు విరాళం

అనుమానమే పెనుభూతమై.. 7

- భార్యను చంపి పరారైన భర్త
- ఇంద్రపాలెంలో సంఘటన

దిత్వా కష్టాలు.. తడిసిన ధాన్యంతో రైతుల పాట్లు

- టార్పాలిన్లపైకి చేరిన వర్షపు నీరు
- వరి కుప్పల్లోకి సైతం స్వల్పంగా చేరుతున్న నీరు


గొల్లప్రోలు పట్టణ శివారులో తడిసిన ధాన్యాన్ని వేరు చేస్తున్న రైతులు, కూలీలు

దిత్వా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. పలుచోట్ల ఆరబెట్టిన ధాన్యం రాశుల్లోకి నీరు చేరింది. వరికుప్పల్లోకి నీరు స్వల్పంగా చేరుతుండడంతో రైతులు కలవరానికి గురవుతున్నారు. వారు తడిసిన ధాన్యం రాశులను వేరుచేసి ఆరబెట్టుకునే ప్రయత్నాల్లో పడ్డారు.

(గొల్లప్రోలు/పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఆరుగాలం శ్రమించి పండించిన పంటపై ప్రకృతి మరోమారు కన్నెర్ర చేసింది. దిత్వా తుఫాన్ ప్రభావం కాకినాడ జిల్లాపై అంతగా ఉండదని వాతావరణ శాఖ తెలిపింది. అయితే ఆదివారం నుంచే మారిన వాతావరణం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. తుఫాన్ తీవ్ర వాయుగుండంగా బలహీనడినప్పటికీ ఆదివారం రాత్రి నుంచి వర్షం పడుతూనే ఉంది. సోమవారం తెల్లవారుజామున అధిక వర్షం పడింది. ఉదయం 9 గంటల తర్వాత వర్షం తగ్గడంతో రైతులు పొలాల్లో ఉండిపోయిన ధాన్యం రాశులు, వరికుప్పల పరిస్థితిని గమనించి నీరు బయటకు పోయే మార్గాలు తీయడంలో నిమగ్నమయ్యారు. ఏలేరు, పీబీసీ, పంపా, తాండవ ఆయకట్టులతో పాటు మెట్ట మండలాల్లో మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో పలుచోట్ల ధాన్యం రాశులు కళ్లాలు, లే-ఔట్ స్థలాలు, జాతీయ రహదారి వెంబడి ఉండిపోయాయి.

కాపాడే ప్రయత్నం చేసినా...

ధాన్యం రాశులు తడవకుండా ఉండేందుకు పిఠాపురం, గొల్లప్రోలు తదితర ప్రాంతాల్లో రైతులు బరకాలు, టార్పాలిన్లు కప్పారు. గాలుల ప్రభావంతో అవి ఎగిరిపోకుండా ఉండేందుకు రాళ్లు ఉంచారు. అయినప్పటికీ రాత్రి నుంచి పడిన వర్షంతో గొల్లప్రోలు తదితర ప్రాంతాల్లో ధాన్యం రాశుల్లోకి నీరు చేరింది. దీంతో తడిసిన ధాన్యాన్ని వేరుచేసి మిగిలిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. మరో వైపు రాశులపై ఉంచిన బరకాలపై వర్షపు నీరు నిలిచిపోయింది. కుప్పలను సాధారణ పద్ధతుల్లోనే వేయడంతో వర్షపు నీరు స్వల్పంగా లోపలకు చేరిందని రైతులు తెలిపారు.

మిల్లుల వద్ద బారులు

ప్రస్తుతం కాకినాడ జిల్లాలోని రైసుమిల్లుల వద్ద ధాన్యం లోడుతో ఉన్న లారీలు, ట్రాక్టర్లు బారులు తీరి కనిపిస్తున్నాయి. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆన్‌లోడింగ్‌ను యుద్ధప్రాతిపదికన చేయించాల్సిన మిల్లర్లు దానిపై దృష్టి పెట్టకపోవడంతో వాహనాలు మిల్లుల వద్దే నిలిచి కనిపిస్తున్నాయి. ధాన్యం బస్తాలు తడవకుండా ఉండేందుకు వాటిపై బరకాలు, ప్లాస్టిక్ షీట్లు కప్పారు. ఇక తుఫాన్ ప్రభావంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. పిఠాపురం తదితర ప్రాంతాల్లో సోమవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 25 డిగ్రీలకు పరిమితమైంది. దీంతో పాటు చల్లటి గాలులు వీయడంతో పగటిపూట కూడా స్వెట్టర్లు, క్యాప్‌లు, ఇతర రక్షణ దుస్తులు ధరించి తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.


పిఠాపురం శివారులో జాతీయ రహదారి వద్ద ధాన్యం రాశిపై కప్పిన టార్పాలిన్‌పై నిలిచిన వాన

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి

తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో ధాన్యం, వరి పనలు తడిస్తే రంగుమారకుండా ఉండేందుకు ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ సూచించారు. ఇప్పటికే కోతలు కోసి కుప్పలు వేసి ఉన్నచోట తడవకుండా బరకాలు కప్పాలని కోరారు.



కాకినాడ జిల్లా పిఠాపురంలోని బాదం మాధవరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

పదో తరగతి పరీక్షలకు విద్యా శాఖ విద్యార్థులను సన్నద్ధం చేస్తోంది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చి 16 నుంచి జరగనున్న పరీక్షలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేయగా, ప్రత్యేక పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళికను ఈ నెల ఆరో తేదీ నుంచి అమలు చేయనున్నారు. దీనిని పక్కాగా చేపట్టాలని ఎంఈవోలు, డీవైఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు ఈ పదునైన ప్రణాళిక ఉపయోగపడాలన్న ఉద్దేశంతో ఉన్నారు. ఈ ఏడాది కాకినాడ జిల్లాలో 29,866 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

- పదో తరగతి ఉత్తీర్ణతపై ప్రత్యేక శ్రద్ధ
- వంద రోజుల ప్రణాళికను సిద్ధం చేసిన కాకినాడ జిల్లా విద్యా శాఖ
- సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్
- హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యత
- స్లో లెర్నర్స్ కోసం స్టడీ మెటీరియల్ అందజేత



'దశ'మారేలా!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లా వెనుకబడుతోంది. గత ఏడాది విడుదలైన ఫలితాల్లో 15వ స్థానంలో నిలిచింది. ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు రెండు, మూడు స్థానాల్లో ఉండే ఫలితాలు దిగజారిపోవడం ఆందోళన కలిగించే అంశం. అయితే ఈ సారి ఆ పరిస్థితి లేకుండా టాప్-5లో ఉండేలా విద్యాశాఖాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా ఈ నెల నుంచి వంద రోజుల కార్యచరణ అమలు చేయనున్నారు. ఇందులో ప్రధానంగా విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ఇప్పటికే ఆదేశించారు. ప్రతి విద్యార్థినీ సంబంధిత ఉపాధ్యాయులు దత్తత తీసుకుని వారి అభ్యసన స్థాయిని నిరంతరం పరిశీలించాలని కోరారు. ఏదైనా సబ్జెక్టులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు, పునశ్చరణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థీ తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మండల, జిల్లా స్థాయి విద్యాశాఖాధికారులు నిత్యం పాఠశాలలను సందర్శించి, బోధనా విధానం, విద్యార్థుల అభ్యసన స్థాయిలపై సూచనలు జారీ చేస్తున్నారు. స్లో లెర్నర్స్ కోసం ఇప్పటికే స్టడీ మెటీరియల్‌ను ప్రతి పాఠశాలకు అందించారు.

'పది' ఫలితాలకు పదునైన సూత్రాలు..

- జిల్లావ్యాప్తంగా ఏటా ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉన్న పాఠశాలల్లో బోధనను విద్యాశాఖాధికారులు నిత్యం పర్యవేక్షించేలా, ప్రతిరోజూ పాఠశాలను సందర్శించేలా ఆదేశాలిచ్చారు.
- విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.
- పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి బోధన తీరు మెరుగుపరిచేందుకు కృషి చేయాలి.
- కష్టమైన గణితం, ఇంగ్లిష్, సైన్స్ బోధన ఎలా సాగుతోందో పక్కాగా పరిశీలించాలి.



కాకినాడ జిల్లా గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాయంత్రం పునశ్చరణ తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవోలు



కాకినాడ జిల్లా గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈవో రమేష్

- ఆయా పాఠ్యాంశాలను బోధించే ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా పరీక్షల్లో తప్పకుండా వస్తాయని భావించే ప్రశ్నలను విద్యార్థులకు బోధించాలి.
- పరీక్షల్లో తప్పకుండా ఇస్తారని భావించే ప్రశ్నలను విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుని రాసేలా మెరుగైన శిక్షణ ఇవ్వాలి.
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారు ప్రతి సబ్జెక్టులోనూ ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దాలి.
- పరీక్షల్లో తప్పక వస్తాయని భావించే ప్రశ్నలను ప్రతిరోజూ విద్యార్థులతో చూడకుండా రాయించాలి. హోం వర్క్ ఇవ్వాలి.
- ఉపాధ్యాయులు ప్రతివారం విద్యార్థుల సామర్థ్యానికి సంబంధించిన నివేదికను రూపొందించి వారికి ఇవ్వాలి.
- బాగా వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుని శిక్షణ ఇవ్వాలి. ప్రతి వారం విద్యార్థులు ఎన్ని మార్కులు సాధిస్తారనే విషయంపై పాఠశాల హెచ్‌ఎం నివేదిక రూపొందించాలి.
- బొమ్మలు గీయడం, మ్యాప్ పాయింటింగ్, గ్రాఫ్ తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి పరీక్షలకు సమాయత్తం చేయాలి.

గత కొన్నేళ్లుగా ఫలితాలు ఇలా...

సంవత్సరం	విద్యార్థుల హాజరు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
2021-22	66,175	46,579	65.83
2022-23	27,358	18,608	68.02
2023-24	27,671	22,993	83.09
2024-25	27,368	22,508	82.24



మూఢం

శుభ కార్యాలకు విరామం

- ఫిబ్రవరి 17 వరకు శుక్ర మౌఢ్యమి
- మూడు నెలలు ముహూర్తాలు లేవు
- పలు రంగాలపై ఆర్థిక ప్రభావం

పెద్దాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రహాల స్థితిని బట్టి కర్మ కాలాలు లేదా మూఢమి లాంటివి జ్యోతిష శాస్త్రం ద్వారా వినిపించే మాటలు. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలకు విరామం రానుంది. మార్గశిర శుద్ధ షష్ఠి (నవంబరు 26)న ప్రారంభమైన శుక్ర మౌఢ్యమి మాఘ బహుళ అమావాస్య (ఫిబ్రవరి 17) వరకు కొనసాగనుంది. దీంతో 83 రోజుల పాటు శుభ ముహూర్తాలు లేవు.

మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభ కార్యాలు అధికంగా జరుగుతాయి. ఈసారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలు ఉండగా పుష్య మాసం శూన్య మాసం అవుతుంది. ఇక మాఘంలో ఒక్క ముహూర్తం కూడా లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతీదేవి జన్మదినమైన వసంతపంచమి, మహా మాఘిగా కీర్తించబడే మాఘ పౌర్ణమి... ఈసారి మూఢంలోనే కలిసిపోతాయి.

మూఢం అంటే...

జ్యోతిష శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాల్లో కనుమరుగైపోవడమే మౌఢ్యమి. వాడుక భాషలో మూఢమి అంటే చీకటి. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడు కూడా అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనమవ్వడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిషులు చెప్తున్నారు. అందుకే శుక్ర మౌఢ్యమి ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభసూచకం కాదంటారు.

వ్యాపారులపై ప్రభావం...

శుభకార్యాలు లేకపోతే వివాహ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, వస్త్ర, ఆభరణాల దుకాణాలు, స్వర్ణకారులు, క్యాటరింగ్, ఫొటో, వీడియోగ్రాఫర్లు, టెంట్ హౌస్, పూల దుకాణాలు, లైటింగ్, డీజేలు, అద్దె కార్లు, బస్సులు, సన్నాయి మేళాలు... ఇలా సంబంధిత వర్గాల వారు నెలల కొద్దీ నష్టపోవాల్సి వస్తుంది. పౌరోహిత్యంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

శుభ కార్యాలు చేయకూడదు



వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడు నెలలు శుభ కార్యాలకు మంచి రోజులు లేవు. శుక్ర మౌఢ్యమి వల్ల ఒక్క ముహూర్తం కూడా ఉండదు. గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు కూడా చేసుకోకూడదు.

చింతా గోపీశర్మ సిద్ధాంతి
పెద్దాపురం, కాకినాడ జిల్లా

డొంకరాయి నుంచి వాటర్ కట్

రెండు నెలలపాటు నీరు నిలుపుదల
ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ రాజారావు



డొంకరాయి పవర్ కెనాల్, జెన్కో చీఫ్ ఇంజనీర్ రాజారావు

మోతుగూడెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీటిని సరఫరా చేసే డొంకరాయి పవర్ కెనాల్ నుంచి నీటి విడుదలను రెండు నెలల పాటు నిలిపివేస్తున్నట్టు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు తెలిపారు.ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 115 మెగావాట్ల సామర్థ్యం (ఒక్కొక్కటి) గల 5, 6 యూనిట్లకు కమీష నింగ్ పనుల్లో భాగంగా ఫోర్‌బే డ్యాం నుంచి పెన్‌స్టాక్ పైపులైన్ ద్వారా నీరు పంపడానికి అవసరమైన వాటర్ కండక్టర్ సిస్టంను ఫోర్‌బే ఇంటెక్ వద్ద ఏర్పాటు చేయాలని, ఈ పనులు చేయాలంటే డొంకరాయి పవర్ కెనాల్ నుంచి వచ్చే నీటి విడుదలను పూర్తిగా నిలిపి వేయాలని సీఈ తెలిపారు. దీని కోసం డిసెంబరు 2 నుంచి రెండు నెలల పాటు ఏపీ జెనికో గ్రిడ్ ఉన్నతాధికార్ల నుంచి ఎల్‌సీ అనుమతులు తీసు కున్నామని ఆయన తెలిపారు. ఈ రెండు నెలలు పాటు పొల్లూరు, డొంకరాయి జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. అలాగే ఈ షట్‌డౌన్ సమయంలో పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలోని నాలుగు యూనిట్లకు కొన్ని ఆపరేషన్ మెంటెనెన్సు పనులు చేయడానికి ప్రతిపాదనలు చేశామన్నారు. అలాగే డొంకరాయి జలవిద్యుత్ కేంద్రంలో యూనిట్ క్యాపిటల్ ఓవరాలింగ్ పనులను నిర్వహించనున్నామని చెప్పారు. సీలేరు కాంప్లెక్సు పరిధిలో 2నెలలు పాటు విద్యుత్ డిమాండ్ మేరకు గ్రిడ్ అధికార్ల ఆదేశాలతో ఎగువ సీలేరు జల విద్యుత్ కేంద్రంలో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని జెన్కో చీఫ్ ఇంజనీర్ రాజారావు తెలిపారు.

జాతీయ ఖోఖో పోటీలకు జట్ల ఎంపిక

- నెలాఖరున రాజస్థాన్‌లో పోటీలు
- ఏపీ నుంచి 2 జట్లు పాల్గొంటాయి
- ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

లంకెలపాలెం (అనకాపల్లి జిల్లా), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14 బాలుర, బాలికల జాతీయ స్థాయి ఖోఖో జట్లను అనకాపల్లి జిల్లా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం రాత్రి ఎంపిక చేశారు. మూడు రోజులు పాటు ఇక్కడ జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచిన సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో విశేషంగా రాణించిన క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెలాఖరులో రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఏపీ నుంచి రెండు జట్లు పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. కాగా ఎంపికైన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం నాయుడు, హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎంవీ. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

జె.హర్షవర్ధన్ (విశాఖపట్నం), జి.మనోహర్ నాయుడు (విశాఖపట్నం), టి.సూర్యనారాయణ (చిత్తూరు), ఎస్.బద్రీనాథ్ (చిత్తూరు), టి.శృతిసాయి కీర్తన్ (విశాఖపట్నం), ఎం.శ్రీకాంత్ (గుంటూరు), సి.నగేష్ (కర్నూలు), కె.వెంకటసాయి (ప్రకాశం), ఎ.భూపతిరెడ్డి (తూర్పుగోదావరి), బి.కార్తీక్ (శ్రీకాకుళం), ఎస్.రామ్‌చరణ్ (కడప), కె.చరణ్ (విశాఖపట్నం) ఎంపికయ్యారు.

బాలికల జట్టు

ఆర్.శృతిక (విశాఖపట్నం), ఆర్.లలితాదేవి (విశాఖపట్నం), ఎం.యువశ్రీ (చిత్తూరు), పి.జయశ్రీ (చిత్తూరు), ఎన్.అర్చనారెడ్డి (చిత్తూరు), జి.చందన (శ్రీకాకుళం), కె.పావని (విజయనగరం), టి.సింధు (ప్రకాశం), ఎన్.బంధవిక (కృష్ణా), జి.అనుపమ (కడప), ఆర్.వీణ (అనంతపురం), టి.ప్రియ (తూర్పుగోదావరి) ఎంపికైనట్టు ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు.



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

డాక్టర్ మంజూషకు టైమ్స్ గ్రూప్ పురస్కారం

సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



నటుడు అనుపమ్‌ఖేర్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ మంజూష

పిఠాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఎంఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ గైనకాలజిస్టు డాక్టర్ సలాది మంజూషకు ప్రతిష్ఠాత్మకమైన టైమ్స్ గ్రూప్ పురస్కారం లభించింది. 2025 సంవత్సరానికి సంబంధించి టైమ్స్ ఎక్సలెన్స్ హెల్త్ 6వ ఎడిషన్‌లో సర్వీస్ ఎక్సలెన్స్ ఇన్ గైనకాలజీ అండ్ ఉమెన్స్ హెల్త్ కేర్‌లో ఆమెకు ఈ పురస్కారాన్ని ప్రకటించారు.హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో మంజూషకు ఈ అవార్డును ప్రముఖ హిందీ నటుడు అనుపమ్‌ఖేర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

స్కాట్ జంబోరీలో శ్రీహర్షకు నేషనల్ అవార్డు

తాళ్లపూడి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన గుమ్మడి శ్రీహర్ష లక్నోలో జరిగిన భారత స్కాట్ అండ్ జంబోరీలో నేషనల్ కాంపిటీషన్‌కు హాజరై అవార్డు సాధించాడు. శ్రీహర్ష న్యూ ఆరుగొలను బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. కాగా ఈ పాఠశాలలో తొమ్మిది మంది విద్యార్థులకు అవార్డులు రావడంతో పలువురు గ్రామస్థులు వారికి అభినందనలు తెలిపారు.



మహా సంస్థానంలో దత్తాత్రేయ స్వామికి తులసి అర్చన

మహా సంస్థానంలో వైభవంగా లక్ష తులసి అర్చన

పిఠాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం విశేష పూజలు జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు లక్ష తులసి అర్చన నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో రుత్వికులు తులసిదళాలతో అర్చన చేశారు. అనంతరం స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. అంతకు ముందు మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, రుత్వికులచే దత్తమూలమంత్ర అనుష్ఠానము, సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, దత్త మంత్రహోమం నిర్వహించి వివిధ హారతులు ఇచ్చారు. స్వామికి సాయంత్రం పల్లకీ సేవ కనుల పండువగా జరిగింది. ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాదగయ క్షేత్రంలో స్వయంభూవుగా వెలసిన దత్తాత్రేయస్వామికి సహస్ర గులాబీ అర్చన నిర్వహించారు. పండితులు వేదమంత్రోచ్ఛారణలతో అర్చన జరిపించి దత్తాత్రేయ స్వామిని అలంకరించారు. మహాగణపతి పూజ, కలశ స్థాపన, రుత్విక్‌వరుణలు, పంచామృత సహిత రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, రుత్విక్కులచే దత్తమాల మంత్ర అనుష్ఠానం, అగ్నిప్రతిష్ఠాపన, దత్తమూల మంత్రహోమాలు, మంగళహారతి నిర్వహించారు. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పాదగయ క్షేత్రంలో పుష్పాలంకరణలో స్వయంభూ దత్తాత్రేయ స్వామి



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో లక్ష తులసి అర్చన నిర్వహిస్తున్న రుత్వికులు

క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే పంతం నానాజీ.. కాకినాడలో అంతర్ జిల్లాల స్కేటింగ్ చాంపియన్‌షిప్



స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. సోమవారం కాకినాడ వివేకానంద పార్కు ఆవరణలోని స్కేటింగ్ రింక్‌లో 69వ అంతర్ జిల్లాల స్కేటింగ్ చాంపియన్‌షిప్ అండర్-11, 14, 17, 19 క్యాటగిరిల్లో టోర్నమెంట్ కం సెలెక్షన్ నిర్వహించారు. దీనికి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సుధారాణి, అడ్మిన్ సెక్రటరీ కె.శ్రీనివాస్, డీఈవో పి.రమేష్, శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్, ఆర్‌ఐవీఈఈ జాన్సన్, డీవైఈవో సత్యనారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. పోటీలకు 13 జిల్లాల నుంచి సుమారు 450 పిల్లలు పాల్గొన్నారు. 50 మంది పీడీలు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్ పోటీలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హాకీ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి వి.రవిరాజ్, లంక జార్జ్, పరశురాము, నూరిబాబు, సురేష్ రాజు పాల్గొన్నారు.



వినూత్న ఆవిష్కరణలపై జేఎన్టీయూలో ఎఫ్‌డీపీ



జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

జేఎన్టీయూకే, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూలోని అలూమ్ని ఆడిటోరియంలో స్కూల్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్సెస్ టెక్నాలజీస్, ఐఎస్టీ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ వరకు నిర్వహించే సదస్సుకు ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఐఎస్టీ డైరెక్టర్ బీటీ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సును సోమవారం ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వివిధ పరిశోధన, శాస్త్ర సంబంధ అంతర విభాగ రంగాల ప్రయోజనాలను వివరించారు. అనంతరం డాక్టర్ టీకే సాహు ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ టీబీ వ్యాక్సిన్ ఆవిష్కరణను తెలిపారు.ప్రొఫెసర్ రవికుమార్ ఔషధ పంపిణీ వ్యవస్థల గుణాలు, చెడు ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

దేవరపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం ఏకాదశి సందర్భంగా స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సూతాపల్లి రామారావు దంపతులు పీటలపై కూర్చోగా ఆలయ ప్రధాన అర్చకులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు ఈ కల్యాణోత్సవాన్ని వేద మంత్రాలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఐవీఆర్ఎస్ సర్వేలో
'అన్నవరం' ఆరో స్థానం

కొనసాగుతున్న భక్తుల అసంతృప్తి

అన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధానాలయాల్లో భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలో కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానానికి భక్తుల నుంచి అసంతృప్తి శాతం కొనసాగుతుంది. సోమవారం ప్రభుత్వం విడుదల చేసిన సర్వేలో అన్నవరం దేవస్థానం 69.7 శాతంతో ఆరోస్థానంలో నిలిచింది. 73.8 శాతంలో ద్వారకా తిరుమల మొదటిస్థానంలో ఉండగా 67.9 శాతంతో విజయవాడ చివరిస్థానంలో నిలిచింది. అన్నవరం ప్రసాదం నాణ్యత, రుచి విషయంలో 77.6 శాతం బాగుందని తెలిపారు. ఈ విషయంలో అన్నవరం దేవస్థానం 5వ స్థానం, శానిటేషన్ నిర్వహణలో 64.2 శాతం మంది బాగుందని చెప్పడంతో ఆరోస్థానంలో ఉంది. ఏడు ప్రధాన దేవాలయాల్లో అక్టోబరు 25 నుంచి నవంబరు 25 వరకు చేపట్టిన సర్వేలో ఈ గణాంకాలను విడుదల చేశారు. దర్శనం సంతృప్తిగా జరగడం, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పన, ప్రసాదం రుచి, నాణ్యత, పారిశుధ్యంపై ప్రతినెలా ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహిస్తుంది.

సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డుకు
3,200 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి


సామర్లకోటలో దిగుమతి అవుతున్న ధాన్యం

సామర్లకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డుకు కృష్ణా జిల్లా గుడివాడ నుంచి ప్రత్యేకంగా రెండు గూడ్స్ రైళ్ల ద్వారా 3,200 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం రెండు రోజులుగా దిగుమతి అయ్యింది. సామర్లకోట ఏడీబీ రోడ్డులోని ఒక ప్రముఖ రైస్‌మిల్లు ఈ ధాన్యాన్ని దిగుమతులు చేసుకున్నట్టు రైల్వే పార్సిల్ వర్గాల ద్వారా తెలిసింది. పొరుగు రాష్ట్రాలైన బీహార్, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి ఇక్కడకు ధాన్యం దిగుమతులు కావడం సహజంగా వస్తున్నప్పటికీ మొట్టమొదటిసారిగా కృష్ణా జిల్లా గుడివాడ నుంచి రెండు రైళ్ల ద్వారా 3,200 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం దిగుమతులు కావడం విశేషం. ధాన్యం దిగుమతుల కోసం రైల్వేకు రవాణా చార్జీలుగా రూ.28 లక్షల ఆదాయం సమకూరింది. దీంతో సామర్లకోటకు చెందిన 100 లారీలకు దిగుమతులు, ఎగుమతుల ద్వారా సుమారు రూ.5 లక్షల మేర రవాణా చార్జీలగానూ, 150 మంది కూలీలకు మరో రూ.5 లక్షలమేర హమాలీ జట్టు కూలీలకు ఉపాధి లభించినట్లైంది.

70 శాతం ఆన్‌లైన్..

- అన్నవరం దేవస్థానం సత్రం గదుల్లో 70 శాతం ఆన్‌లైన్ ద్వారా కేటాయింపు
- పర్వదినాలు, వివాహాల సమయంలో సిఫార్సు లేఖలకు స్వస్తి
- పెరిగిన సత్రం గదుల అద్దె రేట్లు అమలు



రత్నగిరిపై సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం

అన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ఉన్న సత్రంగదుల్లో 70శాతం గదులను ఆన్‌లైన్‌లో ఉంచాలనే దేవదాయశాఖ ఆదేశాలను సోమవారం నుంచి అధికారులు ఆచరణలో పెట్టారు. దేవస్థానంలో సుమారు 470 గదులు అందుబాటులో ఉండగా వీటిలో 70 శాతం గదులు అంటే సుమారు 330 గదులను భక్తులు ఆన్‌లైన్ ద్వారానే బుకింగ్ చేసుకోవచ్చు. మిగిలిన 30శాతం గదులు వివాహాలకు దేవస్థానం అడ్వాన్స్ రిజర్వేషన్ చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు. దీంతో భక్తులు క్యూలైన్‌లలో ఉండి పడిగాపులు పడాల్సిన అవసరం ఉండదని దేవదాయశాఖ ఆలోచనగా తెలుస్తుంది. మరోపక్క పర్వదినాల్లో గదులు దళారులు చెంత కు వెళ్తున్నాయనే ఆరోపణలకు చెక్ పడనుంది. ఒక మెయిల్ ఐడీతో కేవలం 2గదులు మాత్రమే ఆన్‌లైన్‌లో బుక్ అయ్యేవిధంగా తిరిగి ఆ మెయిల్ ఐడీ ద్వారా 2 నెలల పాటు బుకింగ్ చేసుకోవడానికి వీలులేకుండా సిస్టమ్‌ను అప్‌డేట్ చేశారు. ఇదిలా ఉండగా వివాహాల సమయంలో, కార్తీకమాసం వంటి పర్వదినాల్లో సిఫార్సు లేఖలు కుప్పలుతెప్పలుగా వచ్చిపడి దేవస్థానం అధికారులకు శిరోభారంగా మారుతుంది. ఆన్‌లైన్ విధానంతో సిఫారస్‌లేఖలకు కత్తెరపడనుంది. మరోపక్క సత్రంగదులకు పెంచిన అద్దె ధరలు సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. ప్రకాష్‌సదన్ అద్దె జీఎస్టీతో కలిపి రూ.1260, న్యూ, ఓల్డ్ సెంటినరీ గదులు రూ.700, హరిహరసదన్ నాన్‌ఏసి రూ.800, ఏసీ గదులు జీఎస్టీతో కలిపి రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. శివసదన్ కాటేజీ అద్దెలను యథాతథంగా ఉంచారు.

అన్నవరం దేవస్థానానికి
పెంకుటిల్లు విరాళం


ఇంటిపత్రాలు ఈవోకు అందజేస్తున్న దాత

అన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం గ్రామానికి చెందిన ఒకదాత అన్నవరం దేవస్థానానికి ప్రభుత్వ విలువ రూ.3.82 లక్షలు, మార్కెట్ విలువ రూ.40 లక్షల విలువైన 98.51 చదరపు గజాల పెంకుటిల్లును విరాళంగా అందజేశారు. లింగంపల్లి వెంకట సూర్య సత్యనారాయణ దీనికి సంబంధించి పత్రాలను సోమవారం ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా ఆయన అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం విశాఖపట్నంకు చెందిన కె.శ్రీనివాస్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేశారు. ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు


విరాళం అందజేస్తున్న దాత

ఇసుక తిప్పలో గుర్తుతెలియని మృతదేహం


పోలీసులు గుర్తించిన మృతదేహం

ఆలమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ వద్ద గౌతమి కొత్త బ్రిడ్జి 11-12 పిల్లర్స్‌కు మధ్యలో గోదావరి ఇసుక తిప్పలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆలమూరు పోలీసులు గుర్తించారు. అతడు బ్రిడ్జిపై నుంచి దూకేశాడా.. లేక బ్రిడ్జి కిందకు వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయం నిర్ధారణ కావడం లేదని ఎస్ఐ జి.నరేష్ తెలిపారు. వ్యక్తి వయస్సు 55ఏళ్లు ఉంటాయన్నారు. వివరాలు తెలిస్తే 9440904849కి సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


మృతిచెందిన శివ సూర్యనారాయణ

గండేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇనుప ఊసలు 11 కేవీ విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌కు గురై యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం కె.సూరంపాలెం గ్రామానికి చెందిన వానంశెట్టి శివ సూర్యనారాయణ (24) తాపీ పని చేస్తున్నాడు. పి.నాయకంపల్లి గ్రామానికి చెందిన తాళ్లూరి శ్రీను ఇంటి డాబాపై పిట్టగోడ కట్టుకునేందుకు ఐరన్ ఊసలను మేడ పైకి తెచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు ఇంటిపై ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు ఐరన్ ఊసలకు తగిలి విద్యుత్ షాక్‌తో సూర్యనారాయణ మృతి చెందాడు. మృతుడి మేనమామ కడియం వీర సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐ.పోలవరంలో...

ఐ.పోలవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరానికి చెందిన కోడూరి వెంకటేష్(33) సోమవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న వెంకటేష్ సోమవారం విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు అతనిని టి.కొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటేష్ మృతిచెందాడు. అతడిమృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బైక్స్ దొంగిలిస్తున్న ఇద్దరి అరెస్ట్

రూ.2.20 లక్షల విలువైన మూడు మోటార్‌సైకిళ్లు స్వాధీనం


నిందితులతో సీఐ సత్యనారాయణ బృందం

కాకినాడ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా మోటారు సైకిళ్లు దొంగిలిస్తున్న ఇద్దరిని కాకినాడ త్రీటౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2.20 లక్షల విలువైన 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల కాకినాడ మయూరి థియేటర్ పక్క సందులో, సినిమారోడ్డులో ద్విచక్ర వాహనాలు చోరీ అవుతున్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కె.వి.ఎస్.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానిక పగడాలపేటకు చెందిన గేదెల అంజిబాబు(23), బల్లబ్బాయి రెడ్డి కాలనీకి చెందిన (19) బుద్దా వెంకటేశ్‌ను అరెస్ట్ చేసి 3 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రాజానగరం పోలీసులు

ట్రాన్స్‌ఫార్మర్స్‌లో కాపర్ వైర్ల చోరీ

నలుగురి అరెస్ట్

రూ.2 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

రాజానగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్స్‌లో కాపర్ వైర్లను చోరీచేస్తున్న దొంగలు ఎట్టకేలకు రాజానగం పోలీసులకు చిక్కారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కానవరంలోని కొప్పిశెట్టి వీరబాబు అనే రైతు పామాయిల్ తోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్ వైర్లను గతనెల 21న గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దీనిపై బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టగా కొంతమూరు గ్రామానికి చెందిన పొడుగు వంశీ, బిక్కవోలు శివకుమార్, షేక్ మైసుద్దీన్, కోలమూరు గ్రామానికి చెందిన మాసిగిరి దుర్గయ్యను నిందితులుగా గుర్తించి అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ జీవీవీ సత్యనారాయణ నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 21 కేసులకు సంబంధించి 35 ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి గురైన 120 కిలోల కాపర్ వైర్ల దిమ్మలు స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తు విలువ రూ.2 లక్షలు ఉంటుందన్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

గండేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా మురారి-గండేపల్లి మధ్యలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి మోటార్ సైకిల్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు తెలిపారు. మృతుడి వివరాలు తెలియలేదన్నారు. మృతదేహాన్ని జెడ్.రాగంపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. సమాచారం తెలిసినవారు గండేపల్లి పోలీస్ స్టేషన్‌కి తెలియజేయలన్నారు. ఈ ఘటనపై వీఆర్వో నుంచి వివరాలు తీసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని తెలియజేశారు.

ఆర్టీసీ సిబ్బంది విధులకు ఆటంకం

ఇద్దరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

కోటనందూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్సు సిబ్బంది విధుల నిర్వహణకు ఆటంకం కలిగించి బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిని సోమవారం అరెస్టు చేశామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం.. సోమవారం కాకినాడ జిల్లా తుని నుంచి నర్సీపట్నం వైపు బయలుదేరిన ఆర్టీసీ బస్సులో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సాలలోది వరలక్ష్మీతో మరువాడ గ్రామానికి చెందిన దిమిటి రాజు టిక్కెట్ చిల్లర్‌పై విషయంపై దుర్భాషలాడి తోసేశాడు. డ్రైవర్ పీఎస్‌బాబు అభ్యంతరం వ్యక్తం చేయగా దిమిటి రాజు కాలర్ పట్టుకుని నెట్టివేశాడు. దీంతో రేఖవాని పాలెం వద్ద దిమిటి రాజు బస్సు దిగిన తరువాత కొంతమంది వ్యక్తులతో కలసి కోటనందూరు సెంటర్ వద్ద బస్సు వద్దకు వచ్చి డ్రైవర్‌పై దాడి చేసి కాలర్ పట్టుకుని బెదిరించారు. నర్సీపట్నం బస్‌స్టాండ్ వద్ద నీ సంగతి తెలుస్తామని బెదిరించారు. డ్రైవర్ తీసిన ఫొటోల ఆధారంగా కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో కండక్టర్ వరలక్ష్మీ ఫిర్యాదు చేయగా సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

అనుమానమే పెనుభూతమై...

- గచ్చుపలకరాయితో కొట్టి భార్యను చంపి పరారైన భర్త
- ఇంద్రపాలెంలో సంఘటన
- కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు


మరణించిన బేతా మల్లేశ్వరి


భర్త గంగరాజు

కాకినాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో మద్యం మత్తులో తలపైన గచ్చుపలకరాయితో భర్త గట్టిగా కొట్టడంతో మరణించిన సంఘటన ఇంద్రపాలెంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలోని పిల్లకాలువ రోడ్డులో గల గొల్లపేట 2వ వీధిలోని ఓ ఇంట్లో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం వేములపూడికి చెందిన బేతా మల్లేశ్వరి(47), గంగరాజు దంపతులు అద్దెకు ఉంటున్నారు. వారికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి సంతానం. కుమార్తెకు వివాహం కావడంతో స్వామినగర్‌లో వారు నివసిస్తున్నారు. కుమారుడు గణేష్ మెకానిక్‌గా పనిచేస్తూ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. అయితే కొది రోజులుగా దంపతుల మధ్యగొడవలు జరుగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి సమయంలో కూడా వారిద్దరూ ఘర్షణ పడ్డారు. మద్యంమత్తులో ఉన్న గంగరాజు భార్యపై అనుమానంతో తలపైన గచ్చుపలకరాయితో గట్టిగా కొట్టడంతో ఆమె మరణించింది. తర్వాత భర్త తన సెల్‌ఫోన్, చెప్పులు, దుస్తులను ఇంట్లోనే వదిలేసి పరారయ్యాడు. అపస్మారకస్థితిలో ఉన్న తల్లిని కొడుకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సీఐ చైతన్యకృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు సోమవారం సంఘటన జరిగిన ఇంటిని పరిశీలించి మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించగా క్లూస్ టీమ్ పరిశీలించింది. మార్చురీలో ఉన్న మల్లేశ్వరి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మల్లేశ్వరి కొడుకు గణేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

విద్యార్థులపై హెచ్ఎం కులవివక్ష

తల్లిదండ్రుల ఆందోళన

కొత్తపల్లి మండలం యండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘటన


పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడుతున్న ఎంఈవోలు, ఎస్ఐ

కొత్తపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై కులవివక్షత చూపుతూ, వారి తల్లిదండ్రులను చులకన చేసి మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడుపై చర్యలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు సీఐటీయూ నాయకుడు సీహెచ్.సాంబ, ఐద్వా నాయకురాలు శీలం అప్పలరాజు మద్దతు తెలిపారు. ఈ సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం యండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జీ.సురేష్ బోస్ విద్యార్థుల మధ్య కులవివక్షత చూపుతూ అగ్రకులాలలకు చెందిన విద్యార్థులను చులకనగా మాట్లాడుతున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల పట్ల అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. అంతేకాకుండా బాలికలకు బాలురతో లేనిపోని సంబంధాలను అంటగడుతున్నాడని వాపోయారు. విషయం తెలుసుకున్న కొత్తపల్లి మండల విద్యాశాఖాధికారులు బుర్రా వేణుగోపాల్, పైడిరాజు, ఎస్ఐ జి.వెంకటేష్ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. ఇక మీదట పాఠశాలలో విద్యార్థుల విషయంలో ఎటువంటి వివక్షత లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంఈవోలు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అదేవిధంగా ప్రధానోపాధ్యాయుడు కులవివక్షత చూపడం, అసభ్యకరంగా మాట్లాడుతున్నాడనే ఆరోపణలపై విచారణ నిర్వహించి శాఖాపరమైన చర్యలు చేపట్టనున్నట్టు ఎంఈవో-1 వేణు గోపాల్ తెలిపారు.


పాఠశాల ఆవరణలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కాకినాడ టు మైసూరు
ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ-మైసూరు-కాకినాడ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 1 సోమవారం నుంచి జనవరి 13 వరకూ నడుపనున్నట్టు రైల్వే ఉన్నతాధికారులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. సామర్లకోట మీదుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు డిసెంబరు 1 నుంచి జనవరి 13 వరకూ ఈ ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్టు ఆ ఉత్తర్వుల్లో తెలిపారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారం ఇలా ఉంది.

07033 నంబరు గల కాకినాడ-మైసూరు మధ్య జనవరి 12 వరకూ ప్రతీ సోమ, శుక్ర వారాల్లో కాకినాడలో ఉదయం 9.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు మైసూరు చేరుతుంది. ఈ ప్రత్యేక రైలు డిసెంబరు 1, 5, 8, 12, 15, 19, 22, 26, 29 జనవ రి 5,9,12 చొప్పున 12 ట్రిప్‌లుగా నడువనుంది. సామర్లకోటకు ఉదయం 9.18 గంటలకు చేరుకుని రాజమహేంద్రవరానికి 10.08 గంటలకు, నిడదవోలుకు 10.38 గంటలకు చేరుతుంది. తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెన పల్లి, పిడుగురాళ్ళ, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, బేగం పేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సెరం, రాయచూర్, మంత్రాలయ, ఆదోని, గుంత కల్లు, అనంతపూర్, ధర్మవరం, హిందుపూర్, యలహంక, బెంగుళూరు, కెఎస్ఆర్ బెంగుళూ రు, కొనిగెరి, మాండ్యాల మీదుగా మైసూర్‌కు మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు చేరుతుంది.

07034 నంబరు గల రైలు మైసూరు-కాకినాడ మధ్య డిసెంబరు 2 నుంచి జనవరి 13 వరకూ ప్రతీ మంగళ, శనివారాల్లో బయలుదేరనుంది. ఈ ప్రత్యేక రైలు 12 ట్రిప్‌లుగా నడువనుంది. ఈ రైలు డిసెంబరు 2, 6, 9, 13, 16, 20, 23, 27, 30 జనవరి 6,10,13 చొప్పున 12 ట్రిప్‌లుగా నడువనుంది. మైసూ ర్‌లో ఈ రైలు సాయంత్రం 5.20 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి రోజు రాత్రి 11 గంటలకు కాకినాడ టౌన్ స్టేషన్‌కు చేరుతుంది. నిడదవోలుకు రాత్రి 8.08 గంటలకు..రాజమహేంద్రవరానికి రాత్రి 8.38 గంటలకు చేరుకుని సామర్లకోటకు రాత్రి 9.18 గంటలకు చేరుకుని కాకినాడ టౌన్ స్టేషన్‌కు రాత్రి 11 గంటలకు చేరుతుంది. కాకినాడ-మైసూరు మధ్య 37 హాల్ట్‌లతో 1,391 కిలోమీటర్ల దూరాన్ని 30 గంటల పాటు ప్రయాణిస్తుంది.

ఈ వారానికి రెండు దఫాలు నడిచే ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కట్లు కోసం సమీప రైల్వే స్టేషన్ల లో బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వులలో తెలిపారు. ఈ ప్రత్యేక రైలులో ఎస్ఎల్ఆర్, జీఎస్, హెచ్ఏ-1, ఏ1, బీ1, బీ2, బీ3, బీ4, బీ5, ఎస్1, ఎస్2, ఎస్3, ఎస్4, ఎస్5, ఎస్6, ఎస్7, ఎస్8, ఎస్9, ఎస్10, ఎస్11, జీఎస్, ఎస్ఎల్ఆర్ బోగీలు ఉంటాయి.

'నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'


ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న రామచంద్రరావు

రంపచోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించినట్టు గురుకులాల నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మాదె రామచంద్రరావు తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపు, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని, తొలగించిన గిరిజన ఉద్యోగులను తిరిగి నియమించాలని కోరారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, అందాల బాలిరెడ్డి, బుల్లబ్బాయి తదితరులున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

తాళ్లరేవు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామానికి చెందిన రేకాడి మహాలక్ష్మి కోరింగలోని ఒక రొయ్యల కంపెనీలో పనిచేస్తోంది. గతనెల 29న మధ్యాహ్నం 1గంటకు ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. ఆమె తండ్రి సుబ్రహ్మణ్యం కోరింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.సత్యనారాయణ పేర్కొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

వైభవంగా గీతా జయంతి

పిఠాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం గీతా జయంతి వైభవంగా జరిగింది. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి అర్చకుడు విజయజనార్దనాచార్యులు విశేష అర్చన జరిపి ప్రత్యేక అలంకారం చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు రాయప్రోలు కామేశ్వరశర్మ భగవద్గీత పారాయణ చేశారు. ఈవో నున్న శ్రీరాములు, ఆలయ అభివృద్ధి సేవా సమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మ కమిటీ చైర్మన్‌గా ప్రమాణం చేసిన చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

రైతుల సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే నానాజీ

కరప, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. మండలంలోని నడకుదురు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఆత్మ కమిటీ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. పదవులను అలంకారప్రాయంగా భావించకుండా ప్రజలకు సేవ చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. చైర్మన్ చంద్రశేఖర్, కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాలకు చెందిన 21 మంది డైరెక్టర్లతో అధికారులు ప్రమాణం చేయించారు. వారిని ఎమ్మెల్యే నానాజీ అభినందించి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. టీడీపీ నేతలు నులుకుర్తి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాసబాబా, వ్యవసాయ శాఖ కరప సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు కె.బాబూరావు, ఏవో ఇమ్మిడిశెట్టి సత్య, కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్, ఎంఎస్ఎంఈ బోర్డు డైరెక్టర్ నల్లే ప్రసన్నకుమార్, నాయకులు బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, చీపురుపల్లి జయేంద్రబాబు, యాసలపు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

'యోగాతో మానసిక ప్రశాంతత'


యోగా హాలు, డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న అతిథులు

కాకినాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిగ ఎస్‌కేవీఎస్ఎం పాఠశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన యోగా హాలు, డిజిటల్ తరగతులను సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈవోలు రంగారావు, శ్రీనివాసకుమార్, మాజీ సర్పంచ్ పతాని అప్పన్న, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత కలిగి విద్యలో ఉన్నతంగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కె.ప్రభువరప్రసాద్, మహేష్, పీడీలు శ్రీనివాస్, మాచరరావు, నాగలింగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కార్యవర్గం

అధ్యక్ష, కార్యదర్శులుగా లోవరాజు, సూరిబాబు



లోవరాజు, గంగా సూరిబాబు

పిఠాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్ లోవరాజు, ఎం.గంగా సూరిబాబు ఎన్నికయ్యారు. పిఠాపురంలో జరిగిన ఎస్ఎఫ్ఐ మహాసభల్లో జరిగిన నూతన కార్యవర్గ ఎన్నిక, చేసిన తీర్మానాల వివరాలను రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ సోమవారం వెల్లడించారు. ఉపాధ్యక్షులుగా జి.శ్రీకాంత్, సీహెచ్ సాహిత్, కె.సిద్ధు, జి.చిన్ని, సహాయ కార్యదర్శులుగా సంజయ్, వాసుదేవ్, సత్యం, అమృత, సభ్యులుగా జయరాం, ఉదయకుమార్, ఏసుబాబు, వడ్డి కాసులు, మణికంఠ, నాని, తేజ, సంతోష్, రవి, విపిన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని, పిఠాపురం కేంద్రంగా పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని తీర్మానం చేశారు.

'ఇళ్ల నిర్మాణానికి కరెంటు సౌకర్యం కల్పించాలి'

సర్పవరం జంక్షన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'సొంత ఇళ్లు లేక సుమారు మూడు దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం... గత ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలు పెండింగులో ఉన్నాయి... సరైన రహదారి, కరెంటు సౌకర్యం లేక ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నాం... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది... ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన కరెంటు, నీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలి' అని కొవ్వూరు గ్రామస్తులు ఎమ్మెల్యే పంతం నానాజీని కోరారు. సోమవారం జనసేన మండల శాఖ అధ్యక్షుడు కరెడ్ల గోవిందు, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కొవ్వూరు గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను గొడారిగుంటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఇళ్ల స్థలాలు అప్పగింత, ఇళ్ల నిర్మాణం చేపట్టడంలో ఉన్న ఇబ్బందులు... ముఖ్యంగా కరెంట్ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయించి కరెంటుతో పాటు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సేవలు, మౌలిక సదుపాయాలపై గ్రామానికి చెందిన కూటమి నాయకులు అంతా కలిసి కూర్చుని ప్రతిపాదనలు తయారుచేసి ఇవ్వాలని ఆదేశించారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన ఎరుకుల అభివృద్ధి సంఘం కాకినాడ జిల్లా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ అమలదాసు నూకరాజు ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు ఎస్వీవీ సత్యనారాయణను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పందులు పెంచుకునేందుకు ఎరుకుల కులానికి ఐదు ఎకరాలు భూమిని కేటాయించారన్నారు. అయితే సముద్రం ఆటుపోటులతో ఆ స్థలం ముంపునకు గురవుతోందన్నారు. తక్షణం విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు దాసు, వెంకటరమణ, దాసరి నాగరాజు, మానుపూడి శివ దుర్గాప్రసాద్, గాడి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

కాకినాడ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్, డాక్టర్ డీవీ రాజు మల్టీఆర్గాన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం భానుగుడి సెంటరు నుంచి నాగమల్లితోట సెంటరు వరకు అవయవదానంపై అవగాహన వాకథాన్ నిర్వహించారు. ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ చైర్మన్ పాలడుగు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యం వహించారు. డాక్టర్ డీవీ రాజు మల్టీఆర్గాన్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ జవహర్ మాట్లాడుతూ ఒకరి అవయవదానంతో పది మందికి ప్రాణదానం చేయవచ్చన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, బాదం బాలకృష్ణ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బాదం బాలకృష్ణ, ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు ఎన్‌వీబీ శ్రీనివాసరావు, వేమూరి నరసింహరావు, పీఎస్ఎన్ మూర్తి, ఎ.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. రెండు సంస్థలకు చెందిన సుమారు 100 మంది ప్లకార్డులు పట్టుకుని అవయవదానంపై అవగాహన కల్పిస్తూ నడక కొనసాగించారు.

'కాలువల్లో, రోడ్లపై చెత్తవేస్తే కఠిన చర్యలు'

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాలువల్లో, రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు ఎస్వీవీ సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం ఉదయం ఆయన జగన్నాథపురం 25వ డివిజన్ పరదేశమ్మపేట-నాగరాజుపేటలో పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఒక టీ స్టాల్ వద్ద గ్లాసులను రోడ్డుపై పడేయడం గమనించిన ఆయన షాపు యజమానిని పిలిపించి తక్షణం తొలగించాలని ఆదేశించారు. ఇకపై చెత్తను రోడ్డుపై పడేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుధ్య రోజూ చెత్త సేకరణకు వస్తున్నారా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డీఈ లక్ష్మీనారాయణ, శానిటరీ సూపర్‌వైజరు రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గీతాగోవిందుల పట్టాభిషేక మహోత్సవం

కాకినాడ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకుని గీతా విహార్, గోవింద పరివార్ సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని క్షత్రియ పరిషత్‌లో సోమవారం గీతాగోవిందుల పట్టాభిషేక మహోత్సవం కనుల పండువగా జరిగింది. గీతావిహార్ వ్యవస్థాపకురాలు గ్రంధి నాగమణి-శ్రీహరి దంపతులు పీటలపై కూర్చుని గీత మంత్రహవనం జరిపించారు. కంచిభొట్ల నరసింహమూర్తి వేదమంత్రోచ్చారణలతో సామూహిక గీతా పారాయణం చేశారు. తొలుత శ్రీకృష్ణ భగవానుని విగ్రహానికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిపించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంతలక్ష్మి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భగవద్గీత పఠనం అనంతరం నగర వీధుల్లో గీతాగోవిందుల శోభాయాత్ర జరిపారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు రవిశంకర్, పట్నాయక్, అన్నపూర్ణయ్య శర్మ, సమీర్ విష్ణు, మౌనిక, శిష్య బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపాధ్యాయులు రోల్‌మోడల్‌గా నిలవాలి

జిల్లా విద్యాశాఖాధికారి రమేష్


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రమేష్

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తరగతి గదితో పాటు విద్యార్థుల జీవితాలకు ఉపాధ్యాయులు రోల్‌మోడల్‌గా నిలవాలని డీఈవో పిల్లి రమేష్ సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సాయంత్రం పట్టణం, మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ తరగతి గదిలో ఉపాధ్యాయుల మేనరిజం, నడవడికను విద్యార్థులు దగ్గర నుంచి గమనిస్తారని తెలిపారు. మొబైల్ మాట్లాడుతూ ఇదే విషయాన్ని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్తారన్నారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు నాలుగు వేలు తగ్గిపోయారని తెలిపారు. పాఠశాలల్లో క్వాలిటీ ఎడ్యుకేషన్ ఇస్తే ఈ పరిస్థితి ఉండదని అభిప్రాయపడ్డారు. ఇదే జరిగితే ఉద్యోగ భద్రత కరవుతుందన్నారు. విద్యార్థులు చిన్నచిన్న మాటలు కూడా రాయలేకపోతున్నారని, ఈ పరిస్థితి మారాలని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో అంతర్గతంగా ఉండే ప్రతిభను వెలికితీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంఈవోలు శ్రీనివాస్, శివప్రసాద్ పాల్గొన్నారు.



కాకినాడ 30వ డివిజన్, కరప మండలం నడకుదురులలో పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీ

పండగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ

కాకినాడ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీతో పండగ వాతావరణం నెలకొంటోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన 30వ డివిజన్‌లో వృద్ధులు, వితంతవులు, దివ్యాంగుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి కమిషనరు ఎస్వీవీ సత్యనారాయణ, అదనపు కమిషనరు కేటీ సుధాకర్, హెల్త్‌ఆఫీసర్ పృధ్వీచరణ్, కూటమి నాయకులు బచ్చు శేఖర్, అద్దేపల్లి గంగరాజు, పాబోలు పున్నయ్య, మురళి, చెక్కా రమేష్, వంకాయల కృష్ణ, సుబ్రహ్మణ్యం, నారాయణ, కుమార్, సతీష్, పి.లక్ష్మి, నాగలక్ష్మి, అపరంజి తదితరులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడకుదురులో నూతనంగా మంజూరైన పెన్షన్లను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవోలు సలాది శ్రీనివాసరావు, కర్రి శ్రీనివాసరావు, గ్రామ రెవెన్యూ అధికారి కుంపట్ల గణపతి, జూనియర్ అసిస్టెంట్ కిరణ్మయి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



తాళ్లరేవు, కొత్తపల్లి డిప్యూటీ ఎంపీడీవోలుగా బాధ్యతలు చేపట్టిన రమణ, శ్రీనివాస్‌లను అభినందిస్తున్న మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది

డిప్యూటీ ఎంపీడీవోల బాధ్యతల స్వీకారం

తాళ్లరేవు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోరింగ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొందిన వీజేవీ రమణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన్ను ఎంపీడీవో లక్ష్మణరావు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల డిప్యూటీ ఎంపీడీవో ప్రకాష్, పంచాయతీల కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి డిప్యూటీ ఎంపీడీవో, గ్రామ సచివాలయాల అధికారిగా ఎస్.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఉప్పాడ మేజర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఆయన ఉద్యోగోన్నతి పొందారు. శ్రీనివాస్‌ను ఎంపీడీవో కార్యాలయ పాలనాధికారి చలమయ్య ఆధ్వర్యంలో సిబ్బంది శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.


కరప డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు

కరప (ఆంధ్రజ్యోతి): కరప డిప్యూటీ ఎంపీడీవో (జీఎస్‌డబ్ల్యుఎస్)గా కర్రి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ రూరల్ మండలం గంగనాపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలను ఇక నుంచి ఆయన పర్యవేక్షించనున్నారు. శ్రీనివాసరావును ఎంపీడీవో జె.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో (పంచాయతీలు) సలాది శ్రీనివాసరావు, సిబ్బంది అభినందించారు.




కాకినాడ కార్పొరేషన్‌లో ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనరు సత్యనారాయణ, పిఠాపురంలో సమస్య వింటున్న పాడా ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసరావు

'పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరం పరిష్కరించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందుతున్న అర్జీలను తక్షణం పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు ఎస్వీవీ సత్యనారాయణ ఆదేశించారు. సోమవారం ఆయన టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన సమస్యలపై 20 అర్జీలు స్వీకరించారు. అంతకు ముందు జరిగిన డయల్ యువర్ కమిషనరుకు ముగ్గురు ఫోను చేసి సమస్యలను తెలియజేశారు. అదనపు కమిషనరు కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనరు కె.శ్రీనివాస్, ఎస్ఈ పి.వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, డీసీపీ కృష్ణారావు, మేనేజరు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పాడా కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 32 అర్జీలు అందాయి. వినతులు, ఫిర్యాదులను స్వీకరించిన ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు వాటిని సత్వరం పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పిఠాపురం నియోజకవర్గంలో పార్టీపరంగా చేపడుతున్న కార్యక్రమాలు, ప్రతి శుక్రవారం కార్యకర్తే అధినేత గ్రీవెన్స్, కార్యకర్తలతో సమావేశాల నిర్వహణ తదితర అంశాలను వివరించారు.

కంప్యూటర్లు, యోగా పరికరాల వితరణ

కాకినాడ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పైడా శ్రీరామకృష్ణయ్య ఫౌండేషన్, అభయం ఫౌండేషన్ సహకారంతో సమకూర్చిన 20 కంప్యూటర్లు, యోగా పరికరాలు, ఇన్వర్టర్‌లను అధ్యక్షుడు పైడా వెంకటేశ్వరరావు సోమవారం వితరణ చేశారు. కంప్యూటర్ ల్యాబ్‌ను, యోగా హాలును వెంకటేశ్వరరావు దంపతులు ప్రారంభించారని ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతుల రాంబాబు తెలిపారు.

'ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి'

పెద్దాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీవో కె.శ్రీరమణి కోరారు. వైజ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, నవోదయ విద్యార్థుల ఆధ్వర్యంలో గుర్రాల కూడలి వరకు నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఎయిడ్స్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, నవోదయ ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, ఐసీటీసీ కౌన్సిలర్ బి.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా వైద్యులు, సిబ్బంది, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉప్పాడ సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కీర్తి, వైద్యులు డాక్టర్ షబానా, డాక్టర్ మాధురి, డాక్టర్ విక్టోరియా, డాక్టర్ సత్యభాస్కర్, డాక్టర్ కన్యాకుమారి, డాక్టర్ ఇందిరాప్రియదర్శిని, డాక్టర్ చందన, అభివృద్ధి కమిటీ సభ్యులు బొజ్జా కుమార్, వేణుం సురేష్, ఐసీటీసీ కౌన్సిలర్ లక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి.కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తూ పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మానవహారం నిర్మించారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుభాషిణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఉషశ్రీ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రెడ్‌రిబ్బన్ క్లబ్, మైక్రో బయాలజీ, భాషా విభాగాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు డిబేట్, పోస్టర్ ప్రజెంటేషన్, పెయింటింగ్, ఫేస్ పెయింటింగ్, ప్యానల్ డిస్కషన్, రంగోలీ పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు, 145 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



తాళ్లరేవు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.5లక్షలు మంజూరయ్యాయి. సోమవారం వాటిని లబ్ధిదారులకు ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అందజేశారు. టీడీపీ నేతలు మందాల గంగసూర్యనారాయణ, గండి అప్పారావు, కట్టా త్రిమూర్తులు, మందాల సత్తిబాబు, కందెళ్ల గంగబాబు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ-శ్రీశైలం బస్సు సర్వీసు ప్రారంభం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ-శ్రీశైలం నూతన సర్వీసును ప్రారంభించినట్టు ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజరు ఎంయూవీ మనోహర్ తెలిపారు. సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కాకినాడలో ప్రతిరోజు రాత్రి 7.45 గంటలకు బయల్దేరే ఈ బస్సు సామర్లకోట, పెద్దాపురం, రంగంపేట, రాజానగరం, రాజమహేంద్రవరం, విజయవాడ మీదుగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీశైలం చేరుకుంటుంది. శ్రీశైలంలో రాత్రి 7.15 గంటలకు బయల్దేరి మర్నాడు ఉదయం 8.15 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. బస్సుకు సరిపడినంత మంది ఉంటే కోరిన ప్రదేశానికి నేరుగా పంపిస్తామన్నారు. రిజర్వేషన్, ఎంక్వయిరీ కోసం 9959225564, 9959225543 నెంబర్లను సంప్రదించాలని మనోహర్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు (కరప), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాజులూరు సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. కాజులూరు ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని ఆక్వా సర్వీసులకు కుయ్యేరు సబ్ స్టేషన్ నుంచి కొత్త విద్యుత్ లైన్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఈ క్రమంలో అయితపూడి, తిప్పరాజుపాలెం, కాజులూరు, శివారు గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ వీరరెడ్డి చెప్పారు.



అసిస్టెంట్ కలెక్టర్ మనీషా నుంచి అవార్డు తీసుకుంటున్న డాక్టర్ సౌజన్య

ఉత్తమ వైద్యాధికారిగా డాక్టర్ సౌజన్య

కొత్తపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగులాపల్లి పీహెచ్‌సీ పరిధిలో అత్యధికంగా ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించినందుకు వైద్యాధికారి డాక్టర్ సౌజన్య ఉత్తమ వైద్యాధికారి అవార్డు అందుకున్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సౌజన్యకు అసిస్టెంట్ కలెక్టర్ మనీషా అవార్డు అందజేశారు. సౌజన్యకు జనసేన వైద్య విభాగం ప్రతినిధి డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, పీబీసీ డీసీ-2 చైర్మన్ అనిశెట్టి సత్యానందరెడ్డి, గోదావరి తూర్పు డెల్టా చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, పిఠాపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గాది రాజబాబు అభినందనలు తెలిపారు.

పింఛన్ల పంపిణీలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్

గండేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరంపా లెం గ్రామంలో సోమవారం జరిగిన ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదా రుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందచేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

సమస్యలను తహశీల్దార్లు పరిష్కరించాలి

● కలెక్టర్ దినేష్ కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

రంపచోడవరం డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో నెలకున్న సమస్యలను అర్హతలను బట్టి తహశీల్దార్లు పరిష్కరించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రంపచోడవరం, చింతూరు సబ్ డివిజన్ల పరిధిలోని 11 మండలాల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, జాయింట్ కలెక్టర్ శ్రీపూజ, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సరళ వందనంతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వారం వివిధ మండలాలకు సంబంధించి సుమారు 60 దరఖాస్తులు నా దగ్గరకు వస్తున్నాయని, వాటిలో కొన్ని సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూశాఖలో పరిష్కారం కానీ వాటిని సివిల్ కోర్ట్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అంబేడ్కర్, కె.నాజరయ్య, బి.చంద్రశేఖర్, వై.వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, జిల్లా సర్వే అధికారి కె.దేవేంద్రుడు, ఏఎంవో విజయభాస్కర్ , అధికారులు ఉన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

● పలుచోట్ల విద్యార్థులు, వైద్యసిబ్బంది ర్యాలీలు


కూనవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎటపాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమాజం నుంచి ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని లక్ష్మీపురం పీహెచ్‌సీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ నుంచి లక్ష్మీపురం ప్రధాన సెంటర్ వరకు వైద్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న లక్ష్మీ, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

కూనవరం: ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కూటూరు, కూనవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఇందులో డాక్టర్ శ్రీనివాసమూర్తి, డాక్టర్ రాజీవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదని, దీన్ని నివారించుకోవడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. సూపర్‌వైజర్లు డి.శ్రీనివాస్, జి.సీతమ్మ, ఆరోగ్య కార్య కర్తలు, ఆశలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: ఇందుకూరుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పారా లీగల్ వలంటీర్స్ కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మోతుగూడెం: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం మోతుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మెయిన్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. అబిజిచంద్రిక పాల్గొని పోలీస్‌స్టేషన్ సెంటర్లో హెచ్ఐవీ/ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. ర్యాలీలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు, మోతుగూడెం ఎస్ఐ ఎస్‌కే సాదిక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ పీ.అబిజి చంద్రిక మాట్లాడుతూ అందరిలో అవగాహన కలిగిద్దామన్నారు. కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది విజయ సత్యనారాయణ, ఉపాధ్యాయులు శాంసన్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ


దేవీపట్నంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం


దేవీపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇందుకూరు-1 పరిధిలోని ఏనుగులగూడెం ఆర్ అండ్ ఆర్ కాలనీలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి, ఆర్ అండ్ ఆర్ కాలనీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గేదెల పెద్ద సుబ్బారావు, కూటమి నాయకులు పాల్గొని లబ్ధిదారులకు సొమ్ములు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం: మండలంలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు 94 శాతం పూర్తి చేశామని ఎంపీడీవో ఇమ్మాలియన్ తెలిపారు. సోమవారం ఉదయం నుంచే సచివాలయ సిబ్బందితో సహా పలువురు వివిధశాఖలకు చెందిన అధికారులు సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీకి చెందిన పలువురు మండల నాయకులు, జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ, బాగుల అంజన్‌రావు, సాగర్, ముంజపు సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో ప్రతి ఇంటా సంతోషం కన్పిస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు బొల్లా పుల్లయ్య , తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, టీడీపీ సీనియర్ నాయకుడు పాటి చలపతి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతి నిధులు పింఛన్ల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు సొమ్ములు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ అధ్యక్షులు బాచినేని శ్రీకాంత్, బాచినేని మల్లేశ్వరరావు, అమరవరపు రాము పాల్గొన్నారు.

మోతుగూడెం: టీడీపీ పేదల పక్షాన నిలిచే ప్రభుత్వమని ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మోతుగూడెంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మడివి ఊలయ్య, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 55 దరఖాస్తులు


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ప్రజల నుంచి 55 దరఖాస్తులు వచ్చినట్టు ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, ఏపీవో జనరల్ డీఎల్వీ రమణ, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాస రావు, అన్నిశాఖల అధికారులు ఉన్నారు.

పింఛన్లు సకాలంలో అందజేయాలి

- జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

రంపచోడవరం, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్టీ కాలనీలో ఆయన సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్‌తో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపణీ చేశారు. తహశీల్దారు పి.బాలాజీ, సర్పంచ్ మంగా బొజ్జయ్య, డీఎల్డీవో కె.కోటేశ్వరరావు, ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో వై.రాజు, ఏవో జయంతి, హెచ్ఎం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కామరాజు, వీఆర్వోలు ఎ.చిన్నరాజు, శివకుమార్, వార్డ్ మెంబర్ ఫణి పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తుని ఎమ్మెల్యే యనమల దివ్య



ఎస్.అన్నవరంలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివ్య, ఏవీనగరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దివ్య

తుని రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయలు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. తుని మండలం ఎస్.అన్నవరం పంచాయతీ శివారు రామకృష్ణానగర్ ప్రాంతంలో సీసీరోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. పలువురికి ఎన్టీఆర్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్ల పనులకు ప్రణాళిక రచించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ తుని నియోజకవర్గ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, నాయకులు మోతుకూరి వెంకటేష్, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, అప్పన రమేష్ తదితరులున్నారు.

అర్హులందరికీ పింఛన్లు

తొండంగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. సోమవారం ఏవీ నగరం గ్రామంలో పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. ఆర్థిక భారాన్ని లెక్క చేయకుండా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యనమల నాగేశ్వర్రావు, యనమల రాజేష్, యనమల పెదబాబు, కొయ్యా సూరిబాబు, పిర్ల శివ, మనిమెల సతీష్ పాల్గొన్నారు.


భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

అన్నక్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో ఈ సోమవారం గండేపల్లి మండలం ఎన్టీ రాజాపురం గ్రామానికి చెందిన కానుకొలను రాజు ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ అన్న క్యాంటీన్ పరిశీలించారు. గండ్లేపల్లి సొసైటీ చైర్మన్ కంటిపూడి సత్యనారాయణ, ఎస్వీఎస్ అప్పలరాజు, గండేపల్లి సొసైటీ చైర్మన్ కంటిపూడి సత్యనారాయణ, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, రేఖ బుల్లి రాజు, పీలా మహేష్, కానుకొలను వీర వెంకట సత్యనారాయణ, సానిపీని విశ్వేశ్వరరావు, సానిపీని వీర్రాజు చౌదరి, బొల్లిన వాసు, కాటే పల్లి శివ, పెద్దకాపు, సూరిబాబు ఉన్నారు.

సకాలంలో పింఛన్లు అందించాలి


నీలాద్రిరావుపేటలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు

గండేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు సకాలంలో అందించాలని డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నీలాద్రిరావుపేట గ్రామంలో నిర్వహిస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఆయన అందజేశారు. అలాగే పింఛన్లు సకాలంలో అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో అలసత్వం లేకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి మాట్లాడుతూ మండలంలో 8354 పింఛన్‌దారులు ఉండగా ఒక్క రోజులోనే 94శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందన్నారు. ఏవో కే.చంద్రరావు, కార్యదర్శి బాల వీరేంద్ర చౌదరి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్ఐవీకి అడ్డుకట్ట


జగ్గంపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

జగ్గంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో చెప్పుకోవడానికి ఇబ్బందిగా ఉన్న హెచ్ఐవీకి అవగాహ నతో అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ డి.చెన్నారావు అన్నారు. కళాశాలలో సోమవారం ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రజలు రాయబారులుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. హెచ్ఐవీ బాధితుల కు దూరంగా ఉండకుండా సానుభూతితో వ్యవహరిం చాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్.బాలరాజు, అధ్యాపకులు డి.సత్యలత, పీవీవీ సత్యనారాయణ, సీహెచ్ ఝాన్సీరాణి, వి.మల్లికార్జున శర్మ, సురేష్, పద్మశేఖర్, శ్రీను, నవీన పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

గండేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోనిఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్ డే సందర్భంగా రంగంపేట మండలం వెంకటాపురం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు.


ఆదిత్య ఫొరెన్సిక్స్ మ్యాగ్‌జైన్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

'ఆదిత్య' ఫోరెన్సిక్స్ పత్రిక విడుదల

గండేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ఫోరెన్సిక్స్ పత్రికను ఏపీఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ జి.పాల రాజు సోమవారం విడుదల చేశారు. ఆదిత్య యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ సైన్సెస్ అసోసియేట్ డీన్ విలాస్ అనిల్ చవన్, బి.వి.ఎస్.ఎస్ ఉదయనాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పాల్గొన్నారు. ఫోరెన్సిక్ రంగంలో శాస్త్రీయ అవగాహనకు పత్రిక ఉపయోగపడుతుందన్నారు.

విద్యార్థుల కోసం శ్రీ ప్రజ్ఞ ట్రై ఇట్ పరీక్ష

జగ్గంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభ వెలికి తీసేందుకు గత రెండేళ్లుగా జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో నిర్వహిస్తున్న ట్రై ఇట్ పరీక్ష ఈ సంవత్సరం కూడా నిర్వహిస్తున్నట్టు చైర్మన్ బండారు నాగబాబు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు 3 కేటగిరీల్లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్ష డిసెంబర్ 14న జగ్గంపేట ఎస్బీఐ బ్యాంకు వద్ద జేవీఆర్ భవన్‌లోని శ్రీ ప్రజ్ఞ విద్యాసంస్థల్లో సబ్ జూనియర్స్ జూనియర్స్‌కి ఉదయం 10.30గంటలకు, పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2గంటలకు నిర్వహిస్తారమన్నారు. డిసెంబరు 21న పాఠశాల క్యాంపస్‌లో పదోతరగతి కేటగిరీలో సబ్ జూనియర్స్ ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు, జూనియర్స్ కేటగిరీలో ప్రథమ బహుమతి రూ.5116, 65శాతం ఫీజు తగ్గింపు, ద్వితీయ బహుమతిగా రూ.3116 నగదు అందిస్తామన్నారు. పరీక్ష రిజిస్ట్రేషన్ రూ.100 అని.. డిసెంబరు 12వ తేదీలోపు ఆసక్తి కలిగిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 767406 6739, 94417 91705 నెంబర్లను సంప్రదించాలని కోరారు.


మాట్లాడుతున్న బండారు నాగబాబు

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే సత్యప్రభ


ఏలేశ్వరం పట్టణంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నామని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. సోమవారం పట్టణంలో 5వ వార్డులో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి, కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, పెండ్ర శ్రీను, యండగుండి నాగబాబు, కోనాల వెంకట రమణ, నాయకులు గట్టిం వెంకటరమణ, పరవాడ రమేష్, బుగతా శ్రీనివాస్, వాగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

ప్రత్తిపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ కూటమి ప్రభుత్వం పింఛన్లు అందిస్తుందని ఏపీ ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు చెప్పారు. ప్రత్తిపాడులో సోమవారం కూటమి నాయకులతో కలిసి ఆయన పింఛన్ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మదినే వెంకన్న దొర, వెలుగుల నాని, ముత్యాల రాంబాబు, వై.గోవిందనాయుడు, పోలిశెట్టి శ్రీను, శెట్టిబత్తుల వీరబాబు, రావూరి తాతాజీ, మదినే స్వామి, మెల్లిపాక నాగు తదితరులు పాల్గొన్నారు. మండలంలో 92శాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేసినట్లు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు

ప్రత్తిపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు, రాచపల్లి గ్రామాల్లో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ నివారణ ర్యాలీలు నిర్వహించారు. ఆసుపత్రిలో వైద్యాధికారులు సౌమ్య షైబెల్, గీతాసుధ మాట్లాడుతూ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎయిడ్స్ నుంచి తప్పించుకోవచ్చన్నారు. ఎయిడ్స్ నిర్మూలన ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆసుపత్రుల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వాసుపత్రి, డిగ్రీ కళాశాల వైద్యులు, ఉపాధ్యాయుల నేతృత్వంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌సీ, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి సిబ్బంది, విద్యార్థులతో కలిసి పట్టణంలో ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు బాలాజీచౌక్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ దైవకృప, ఆసుపత్రి సిబ్బంది, బంగార్రాజు, పుష్ప, సత్యనారాయణ, మేరి, వీరభద్రరావు తదితరులు ఉన్నారు.

రాచపల్లిలో న్యాయ అవగాహన సదస్సు

ప్రత్తిపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాచపల్లిలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన సదస్సులో ప్యానల్ అడ్వకేట్‌లు బుగతా శివ, అవసరాల దేవి మాట్లాడుతూ మానవ హక్కుల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయని, ప్రతి ఒక్కరూ వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈసదస్సులో ఆసుపత్రి వైద్యాధికారిణి గీతా సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

తాపీమేస్త్రిల సంఘ అధ్యక్షుడిగా అప్పన్న

ఏలేశ్వరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీవిఘ్నేశ్వర భవన నిర్మాణ కార్మికుల తాపీమేస్త్రిల సంఘం అధ్యక్ష ఎన్నిక సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా గెద్ద అప్పన్నను ఎన్నుకున్నారు. పట్టణంలో పలువురు ఆయన్ను అభినందించారు.

ఎమ్మెల్యే శిరీషాదేవిని కలిసిన సుబ్బారెడ్డిసాగర్ చైర్మన్

ప్రత్తిపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిని సోమవారం ప్రత్తిపాడు మండలం సుబ్బారెడ్డిసాగర్ చైర్మన్ ఇళ్ళ అప్పారావు, ఏలేరు చైర్మన్ బసవ వీరబాబు, టీడీపీ నియోజకవర్గ నాయకులు కలిశారు.

డిప్యూటీ ఎంపీడీవోగా ఉషారాణి బాధ్యతల స్వీకరణ

ప్రత్తిపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవోగా గొల్లపల్లి ఉషారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. పెదపూడి గ్రామ కార్యదర్శిగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటికే డిప్యూటీ ఎంపీడీవోగా కాశీ విశ్వనాథ్ గ్రామ పంచాయతీలపై పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తుండగా 2వ డిప్యూటీ ఎంపీడీవోగా ఉషారాణి మండలంలోని వార్డు, గ్రామ సచివాలయాల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించనున్నారు.


రాచపల్లిలో గీతా జయంతి పోటీలు


రాచపల్లిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్వామి రామానంద, స్వామి లక్ష్మణానంద

ప్రత్తిపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాచపల్లి రమణ సేవాశ్రమంలో సోమవరం గీతా జయంతి సందర్భంగా నియోజకవర్గ విద్యార్థులకు భగవద్గీత ఆలాపన పోటీలు నిర్వహించారు. భగవద్గీత, రామాయణం, భాగవతం వంటి వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆశ్రమాల నిర్వాహకులు స్వామి రామానంద, స్వామి లక్ష్మణానంద కోరారు. ఈపోటీల్లో సీనియర్ విభాగంలో పతివాడ పూజిత, ఎ.రామసత్యసాయి, జూనియర్ విభాగంలో పీవీఎస్ కార్తిక, బి.త్రిపుర హంసికలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ మాతాజీ నిర్మల, ఉపాధ్యాయుడు గోర్స దుర్గప్రసాద్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలకు గౌరీశంకర్, మురళీకృష్ణ, ఎల్.తాతాజీ, సారే శ్రీరామచంద్ర, గళ్ళ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): స్థానిక అనంతలక్ష్మీ సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో గీతా జయంతిని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, మాతృశక్తి, దుర్గా వాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో భగవద్గీత పఠనం, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. వీహెచ్‌పీ జిల్లా సాంస్కృతిక విభాగ ప్రముఖ్ కటకం కిరీటి నేతృత్వంలో విశ్వహిందూపరిషత్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అలమండ దుర్గా వెంకటప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పాబోలు దేవి, కార్యదర్శిగా కె.ఇందిర ప్రియదర్శినిలను ఎన్నుకున్నారు.

కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలి


వెంకటనగరంలో సర్పంచ్‌తో పాటు 200 మంది వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన దృశ్యం

ప్రత్తిపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి కోరారు. వెంకటనగరంలో సర్పంచ్ సింహాద్రి రమాదేవి, గ్రామపెద్ద నందిలి సత్యనారాయణలతో పాటు వెంకటనగరం, తోటపల్లి గ్రామాలకు చెందిన 200మంది వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. వారికి రామస్వామి, జనసేన సంయుక్త రాష్ట్ర కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్(బాబి)లు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆత్మ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం, ప్రత్తిపాడు మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామకుర్తి కామేష్, పిల్లా పద్మరాజు, ధర్మవరం సొసైటీ చైర్మన్ దాసం శేషారావు, జనసేన నాయకులు బుజ్జి, సుభాష్, మాజీ ఎంపీటీసీ కోరాపు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పోటీకి బీసీ నేతలు సిద్ధం కావాలి

ప్రత్తిపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాబోయే పంచాయతీ ఎన్నికల్లో పోటీకి బీసీ నేతలు సిద్ధం కావాలని ప్రత్తిపాడు నియోజకవర్గ సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం తీర్మానించింది. బవురువాక గ్రామంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ నియోజకవర్గ అధ్యక్షుడు ఒమ్మి గంగరాజు అధ్యక్షతన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీను, బీసీ నేతలు చిలపర్తి శ్రీనివాస్, ముచ్చు అప్పలరాజు మాట్లాడారు. సమావేశంలో నాయకులు బోరా శివ, పెండ్యాల శివ, ఎడ్ల వీరాస్వామి, ఎ.ఆదినారాయణ, ముప్వల అప్పలరాజు, జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న నాయకులు